




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 149 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/-

శనివారం 04 జనవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## లోయలో పడిన వాహనం..

## నలుగురు సైనికుల మృతి.. ఒకరి పరిస్థితి విషమం

జమ్ముకశ్మీర్ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పహారా కాసేందుకు వెళ్తున్న ఓ సైనిక వాహనం బందిపోరాలోని వులార్ వ్యూపాయింట్ వద్ద అదుపుతప్పి.. లోయలోకి పడిపోయింది.



**శ్రీనగర్, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** జమ్ముకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పహారా కాసేందుకు వెళ్తున్న ఓ సైనిక వాహనం బందిపోరాలోని వులార్ వ్యూపాయింట్ వద్ద అదుపుతప్పి.. లోయ-ఎలోకి పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు సైనికులు మృత్యువాత పడగా.. మరొకరికి పరిస్థితి విషమంగా ఉంది.

ఘటనా స్థలిలోనే ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. క్షతగాత్రులను బందిపొరా జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు శ్రీనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. వారం రోజుల క్రితం పూంఛ్ జిల్లాలోనూ ఇదే తరహా ప్రమాదం చోటు చేసుకుంది. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం గరోవా ప్రాంతంలోని 300 అడుగులు లోతైన లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంచు ఎక్కువగా కురుస్తుండటంతో రోడ్డును అంచనా వేయలేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలి.. : మంత్రి నారా లోకేశ్

ఏపీలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు.




**అమరావతి, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కళాశాలలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్లను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, ఎంపీ శివనాథ్, బొండా ఉమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో లోకేశ్ మాట్లాడారు. బాగా చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుందని.. మంచి ఉద్యోగం వస్తే మీ కుటుంబాన్ని బాగా చూసుకోవచ్చని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. “మంగళగిరిలో 2019లో నేను ఓడిపోయాను. కానీ పట్టుదలతో పరిశ్రమించి రికార్డుస్థాయి మెజారిటీతో గెలిచాను. జీవితంలో గెలుపు ఓటములు సహజం. పరీక్షలు తప్పినందుకే చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. విద్యార్థులు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలని నిర్ణయించాం. అందుకే ప్రముఖుల పేర్లతో పథకాలు ప్రారంభించాం. సమానత్వం విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలి. పుస్తకాల్లో ఆటలకు పురుషుల బొమ్మలు, ఇంటి పనులకు బాలికల బొమ్మలు ఉన్నాయి. పాఠ్య పుస్తకాల్లో ఈ అసమానతలను తొలగించాలని అదేశించాను” అని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుండగా గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటర్ కళాశాలల్లో నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించారు.

## లాలాపేటలో దారుణం..

## రెండ్రోజులుగా గదిలోనే తల్లి, కుమారుడి మృతదేహాలు

సికింద్రాబాద్ లాలాపేటలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇంట్లోని ఓ గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



**హైదరాబాద్, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** సికింద్రాబాద్ లాలాపేటలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇంట్లోని ఓ గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశా-ారు. పోలీసులు వచ్చి గది తలుపులు తెరిచి చూడగా.. తల్లి, కుమారుడి మృతదేహాలు కనిపించాయి. తల్లి మృతి చెందడాన్ని తట్టుకోలేక కుమారుడు ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండ్రోజుల క్రితం ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. లాలాగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణపై పోలవరం ప్రాజెక్టు ప్రభావం..

## అధ్యయనానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణ పై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



**హైదరాబాద్, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో వచ్చిన వరదల వల్ల భద్రాచలం ముంపునకు గురైందని, 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అధికారులు సీఎం దృష్టికి తసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం కొత్తగా బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోందని.. ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు వివరించారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ సీఎస్ కు తెలపాలని, అవసరమైతే గోదావరి బోర్డు, కేంద్ర జలశక్తిశాఖకు లేఖలు రాయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## భోపాల్ గ్యాస్ వ్యర్థాల తరలింపు..

## దహన యూనిట్పై రాళ్లదాడి

దాదాపు 40 ఏళ్లుగా భోపాల్ ప్రజలను భయపెడుతున్న యూనియన్ కార్బైడ్ వ్యర్థాలను దహనం చేసేందుకు ఉద్దేశించిన యూనిట్పై పలువురు రాళ్లదాడికి పాల్పడ్డారు.



**భోపాల్, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రదేశ్లోని ‘భోపాల్ గ్యాస్ దుర్ఘటన’ దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైంది. ఈ ఘటన తర్వాత యూనియన్ కార్బైడ్ సంస్థ ఆవరణలోని 377 టన్నుల విష పదార్థాల తరలింపు చర్య మొదలైంది. ఈ వ్యర్థాలను దహనం చేసేందుకు ఉద్దేశించిన యూనిట్పై కొంతమంది రాళ్ల దాడికి పాల్పడ్డారు.

ఈ మేరకు పోలీసులు వెల్లడించారు. ఇండోర్ సమీపంలోని పీథంపుర్ పారిశ్రామికవాడలో వ్యర్థాలను దహనం చేసే యూనిట్పై వంద మందికి పైగా దాడికి పాల్పడ్డారు. యూనిట్ గేట్పై రాళ్లు రువ్వారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ దిశగా విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. 1984 డిసెంబరు 2 అర్ధరాత్రి దాటిన తర్వాత భోపాల్ నగర శివారులోని యూనియన్ కార్బైడ్ పురుగు మందుల కర్మాగారంలోని ట్యాంకు నుంచి 40-45 టన్నుల అత్యంత ప్రమాదకర మిథైల్ ఐసోసైనేట్ (ఎంఐసీ) వాయువు లీకైన సంగతి తెలిసిందే. దీని కారణంగా వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 6 లక్షల మంది అస్వస్థతకు గురయ్యారు. ఆ ఘటన తర్వాత యూనియన్ కార్బైడ్ సంస్థ ఆవరణలో దాదాపు 40 ఏళ్లుగా పడి ఉన్న 377 టన్నుల విష పదార్థాల తరలించే కార్యక్రమం మొదలైంది. జీపీఎస్ అమర్చిన ట్రక్కులు, అత్యంత పకడ్బందీగా తయారు చేసిన కంటైనర్లలో వీటిని పీథంపుర్ పారిశ్రామికవాడలోని యూనిట్కు తరలించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైద్యులు, నిపుణులు అక్కడికి చేరుకున్నారు. దహనం చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతుండగా.. ఓ గుంపు యూనిట్పై రాళ్ల దాడికి దిగింది.

## విశాఖ సాగర తీరంలో సాహస విన్యాసాలు..

## అట్టహాసంగా ‘నేవీ డే’

‘నేవీ డే’ సందర్భంగా విశాఖలోని ఆర్కే బీచ్‌లో భారత నౌకాదళ వాయువిభాగం విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



**విశాఖపట్నం, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** ‘నేవీ డే’ సందర్భంగా విశాఖలోని ఆర్కే బీచ్ లో భారత నౌకాదళ వాయువిభాగం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. విన్యాసాల్లో భాగంగా భారత నౌకాదళ పాటవం, పరాక్రమం ప్రదర్శించారు. దాదాపు 8వేల అడుగుల ఎత్తు నుంచి పారాచ్యూట్ సాయంతో జాతీయ జెండా, నేవీ జెండాను ఎగురవేసి ఆహుతులను ఆశ్చర్యపర్చారు. సాగర తీరంలో యుద్ధ విమానాలు, నౌకలు, హెలికాప్టర్లు, ట్యాంకర్లు సందడి చేశాయి. ఉగ్రవాదుల నుంచి బంధీలను రక్షించే క్రమంలో యుద్ధ విన్యాసాలు, సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల సాయంతో రక్షించే విధానం ప్రదర్శించిన తీరు సందర్శకులను ఆకట్టుకుంది. సముద్రంలో బంకర్ పేలుళ్లు అబ్బురపరిచాయి. నేవీ డే విన్యాసాలను తిలకించేందుకు వచ్చిన నగరవాసులతో సాగర తీరం జనసంద్రంగా మారింది.

## గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసింది : మంత్రి అచ్చెన్నాయుడు

గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు.



**వడ్లమూడి, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. కనీసం రైతులకు అవసరమైన యంత్రాలను అందించలేకపోయిందని మండిపడ్డారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్, విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్తంగా రైతులకు ప్రకటించిన పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తామని చెపా-ఎరు. సాగులో డ్రోన్ టెక్నాలజీని సమర్థంగా భూసార పరీక్షలకు ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నట్లు చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఈ పద్ధతిలో పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో రైతులకు అందిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

## భక్తులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి: మంత్రి ఆనం

రాష్ట్రంలోని ఆలయాల ఆధునికీకరణ, అభివృద్ధి, మెరుగైన సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

**విజయవాడ, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని ఆలయాల ఆధునికీకరణ, అభివృద్ధి, మెరుగైన సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కొత్త ఏడాదిలో తొలిసారిగా ఇంద్రకీలాద్రికి వచ్చిన మంత్రికి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇన్చార్జి ఈవో రామచంద్ర మోహన్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. దర్శనం పూర్తయ్యాక మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆ దుర్గమ్మను కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ అధికారులతో సమావేశమైన ఆనం.. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని.. భక్తులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాద పూర్వకంగా ప్రవర్తించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



## సినిమాల పేర్లు తెలుగులో ఉంటే బాగుంటుంది.. : కేంద్ర మంత్రి కిషన్

భాషను వాడటం ద్వారానే పరిరక్షించగలమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

**హైదరాబాద్, జనవరి 4, (రిపబ్లిక్ న్యూస్):** మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లో కొనసాగుతున్న తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలతో రోజూ బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందని చెప్పారు.




డిజిటల్ విభాగంలో తెలుగు భాష క్రోడీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగంలో మాతృ భాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలని పేర్కొన్నారు. “వికీపీడియాలో తెలుగు వ్యాసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కథలు, వ్యాసాలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయి. తెలుగు కనుమరుగు కాకముందే పరిరక్షించుకోవాలి. బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలి. పాలన, అధికార వ్యవహారాలు తెలుగులో జరగాలి. కొత్త సాంకేతికత, కార్యక్రమాలను మాతృభాషలోనే చేపట్టాలి. వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉంది. 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయి. మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలో విద్య ఉండాలి. కేంద్రం తెచ్చిన కొత్త విధానాన్ని అమలు చేయాలి. ప్రాంతీయ భాష పరిరక్షణకు పెద్దల సహకారం కావాలి. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలి. కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులో ఉండాలి” అని కిషన్ రెడ్డి అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# రామ్ చరణ్ తొలిసారి టీవీలో చూసిన క్లీంకార.. వీడియో వైరల్

తమ కుమార్తె క్లీంకారకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తరచూ షేర్ చేస్తుంటారు రామ్ చరణ్ సతీమణి ఉపాసన. తాజాగా ఆమె ఓ స్పెషల్ వీడియో షేర్ చేశారు.





తమ కుమార్తె క్లీంకారకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తరచూ షేర్ చేస్తుంటారు రామ్ చరణ్ సతీమణి ఉపాసన. తాజాగా ఆమె పంచుకున్న క్లీంకార వీడియో నెటిజన్ల మది దోచేస్తుంది. ఇందులో పాప.. రామ్చరణ్ నటించిన 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' వీక్షిస్తూ కనిపించింది. చరణ్ కనిపించగానే.. స్క్రీన్ వైపు చూపిస్తూ ముద్దుముద్దుగా మాట్లాడుతూ మురిసిపోతూ అలానే చూస్తూ ఉంది. తన తండ్రిని తొలిసారి టీవీలో చూసి క్లీంకార ఎంతో ఆనందం వ్యక్తంచేసిందని ఉపాసన పేర్కొన్నారు. "'ఆర్ఆర్ఆర్' చిత్రం మాకు ఎన్నోవిధాలుగా మధుర జ్ఞాపకాలు అందిస్తోంది. నాన్నను తొలిసారి టీవీలో చూసి క్లీంకార ఎంతో ఆనందించింది. రామ్చరణ్.. నీ విషయంలో ఎంతో సంతోషం, గర్వంగా ఉన్నా. 'గేమ్ ఛేంజర్' కోసం ఎదురుచూస్తున్నా" అని తెలిపారు. రామ్చరణ్ దంపతులకు 2023లో క్లీంకార జన్మించిన విషయం తెలిసిందే. పాపకు ఇబ్బంది కలగకుండా ఉండేలా ఈ దంపతులు ఎన్నో జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఫ్యామిలీ ఫొటోలు పంచుకున్నా అందులో పాప ముఖాన్ని మాత్రం చూపించడం లేదు. రామ్ చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్బస్టర్ మూవీ 'ఆర్ఆర్ఆర్'. భారీ వసూళ్లతోపాటు ఎన్నో రికార్డులు నెలకొల్పిన ఈ సినిమా తెర వెనుక సంగతుల సమాహారంగా 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీని చిత్రబృందం సిద్ధం చేసింది. ఎంపిక చేసిన పలు థియేటర్లలో ఈ డాక్యుమెంటరీ గతనెల 20న రిలీజైంది. ప్రస్తుతం ఇది నెట్ ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. 'గేమ్ ఛేంజర్' విషయానికి వస్తే.. రామ్చరణ్ నటించిన సరికొత్త చిత్రమిది. శంకర్ దర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంది. కియారా అద్వాణీ కథానాయిక. అంజలి, శ్రీకాంత్, సముద్రఖని కీలకపాత్రలు పోషించారు. చరణ్ ద్విపాత్రాభినయం పోషించారు. దిల్ రాజు నిర్మాత. తమన్ స్వరాలు అందిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ప్రతిష్ఠాత్మక అవార్డులకు 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'

పాయల్ కపాడియా తెరకెక్కించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్. ప్రతిష్టాత్మక బాఫ్టా అవార్డులకు ఇది నామినేట్ అయింది.



సినీ ప్రపంచంలో అత్యుత్తమ పురస్కారాల్లో ఒకటిగా భావించే బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) అవార్డులకు ఈసారి 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్ నామినేట్ అయింది. బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ప్లే, బెస్ట్ ఫిల్మ్ నాట్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఇలా దాదాపు మూడు విభాగాల్లో ఈ సినిమా పోటీపడనుంది. ఈవిషయాన్ని తెలియజేస్తూ బాఫ్టా టీమ్ నామినేటైన చిత్రాల జాబితాను తాజాగా విడుదల చేసింది. విజేతల జాబితాను జనవరి 15న ప్రకటించనున్నారు. లండన్ వేదికగా ఫిబ్రవరి 16న అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని తెలిపింది. భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్ ఈ పురస్కారానికి ఎంపిక కావడంపై సినీ ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఆమెకు కంగ్రాట్స్ చెబుతున్నారు. విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. కని కుశ్రుతి, దివ్య ప్రభ ప్రధాన పాత్రల్లో నటించారు. ముంబయి నర్సింగ్ హోమ్లో పనిచేసే కేరళకు చెందిన ఇద్దరు నర్సుల (ప్రభ, అను) కథే 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'. ప్రభ, అను పనిచేసే ఆస్పత్రిలోనే వంట మనిషిగా పనిచేస్తూ ఉంటుంది పార్వతి (ఛాయా కదమ్). జీవితంలో సమస్యలు ఎదుర్కోలేక సొంతూరు రత్నగిరి వెళ్లిపోవాలనుకుంటుంది పార్వతి. ఈక్రమంలోనే నిత్యం కష్టాలు పడుతున్న ప్రభ, అను కూడా ఆమెతో కలిసి రత్నగిరి వెళ్తారు. మరి అక్కడికి వెళ్లాక వాళ్లకు ఎదురైన పరిస్థితులు ఏంటి? ప్రభ తన భర్తను కలిసిందా? అను, షియాజ్ల ప్రేమ ఏమైంది? ఈ సినిమాకు అంతర్జాతీయ పబ్లికేషన్స్లో మంచి రివ్యూలు వచ్చాయి. కేన్స్ ఉత్సవంలో 'గ్రాండ్ పిక్స్' అవార్డు గెలుచుకుంది. 30 ఏళ్ల తర్వాత భారతీయ చిత్రానికి దక్కిన గౌరవమిది. బెస్ట్ నాన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ మోషన్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్ విభాగాల్లో ఈ చిత్రం గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు నామినేట్ అయింది. తెలుగులో ఈ చిత్రాన్ని రానా విడుదల చేశారు. ఇప్పుడీ చిత్రం డిస్నీ ం హాట్ స్టార్ వేదికగా అందుబాటులో ఉంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1643: భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ జననం (మ.1727). (చిత్రంలో)
- 1809: అంధులకు ప్రత్యేక లిపిని (బ్రెయిలీ లిపి) రూపొందించిన లూయీ బ్రెయిలీ జననం (మ.1852).
- 1915: భారతీయ చిత్రకారుడు పాకాల తిరుమల్ రెడ్డి జననం (మ.1996).
- 1945: నటుడు, నాటక రచయిత, దర్శకుడు ఎస్.కె. మిశ్రో జననం.
- 1988: భారత దేశంలో మొట్టమొదటి "టెస్ట్ ట్యూబ్ బేబీ" ని ప్రముఖ వైద్యులు ఇందిరా హిందుజా జన్మింపజేశారు.
- 2007: కూచిపూడి నాట్యాచార్యుడు కోరాడ నరసింహారావు మరణం (జ.1936).



ఐజాక్ న్యూటన్



లూయీ బ్రెయిలీ



తిరుమల్ రెడ్డి



ఎస్.కె. మిశ్రో



ఇందిరా హిందుజా



నరసింహారావు

## జాన్వీకపూర్తో సినిమా చేయను: రామ్ గోపాల్ వర్మ



జాన్వీకపూర్తో సినిమా చేసే ఉద్దేశం ప్రస్తుతానికి తనకు లేదని ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెలిపారు.



జాన్వీకపూర్తో సినిమా చేసే ఉద్దేశం ప్రస్తుతానికి తనకు లేదని ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెలిపారు. జాన్వీకపూర్ను ఆమె తల్లి శ్రీదేవితో పోల్చి చూడటాన్ని ఆయన తోసిపుచ్చారు. శ్రీదేవి మరణించినా అభిమానుల ప్రేమ ఏమాత్రం తగ్గలేదని అందుకే ఈవిధంగా పోల్చి చూస్తున్నారని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. "పదహారేళ్ళ వయసు' లేదా 'వసంత కోకిల'.. సినిమా ఏదైనా సరే శ్రీదేవి ప్రదర్శన మాత్రం అద్భుతంగా ఉంటుంది. నిజం చెప్పాలంటే ఆమె యాక్టింగ్ చూసిన తర్వాత నేనొక ఫిల్మ్ మేకర్ను విషయం మర్చిపోయా. ఆమెని ఒక ప్రేక్షకుడిగా చూస్తూ ఉండిపోయా. అది ఆమె స్థాయి" అని ఆయన చెప్పారు. జాన్వీకపూర్తో సినిమా చేసే ఉద్దేశం ఏమైనా ఉందా? అని ప్రశ్నించగా.. "నాకు శ్రీదేవి అంటే ఇష్టం. ఆమెను ఎంతో అభిమానిస్తుంటా. ఇన్నేళ్ల కెరీర్లో చాలా మంది పెద్ద స్టార్స్, నటీనటులతో నేను కనెక్ట్ అవ్వలేకపోయా. అలాగే, జాన్వీతోనూ సినిమా చేసే ఉద్దేశం ప్రస్తుతానికి లేదు" అని చెప్పారు. శ్రీదేవి కుమార్తెగా జాన్వీకపూర్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. 'ధడక్'తో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చారు. అనంతరం బాలీవుడ్లో తెరకెక్కిన పలు చిత్రాల్లో నటించారు. ఇదిలాఉండగా, శ్రీదేవితో పోలుస్తూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేయడంపై గతంలో జాన్వీ స్పందించారు. "అమ్మతో నన్ను పోల్చి చూడటం అదృష్టంగా భావిస్తా. ఆమె వల్లే నాకు ఈ జీవితం లభించింది. ఇంతమంది అభిమానులను సంపాదించా. ఆమె నాకు ఎప్పటికీ ఆదర్శమే. నా నటనతో అభిమానులను ఎప్పుడూ నిరాశపరచను. వారంతా నాలో అమ్మను చూసుకుంటున్నారు. అందుకే అమ్మ శ్రీదేవితో పోల్చడం నా బాధ్యతను మరింత పెంచుతుంది" అని చెప్పారు. గతేడాది విడుదలైన 'దేవర'లో జాన్వీ టాలీవుడ్లో కి అడుగుపెట్టారు. ఇందులో ఆమె తంగం అనే పాత్రలో మెరిశారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ఆసీస్పై అదిరిపోయే స్టార్టింగ్.. తొలి భారత బ్యాటర్గా యశస్వి ఘనత

ఆసీస్లో టెస్టు సిరీస్లో భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ పలు ఘనతలను తన ఖాతాలో వేసుకొన్నాడు.

సిడ్నీ టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్ కొనసాగుతోంది. నాలుగు పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియాకు మొదటి ఓవర్లోనే అదిరిపోయే ఓపెనింగ్ దక్కింది. మిచెల్ స్టార్క్ వేసిన తొలి ఓవర్లోనే జైస్వాల్ నాలుగు బౌండరీలు బాదేశాడు. ఈ ఓవర్ లో 16 పరుగులు రాబట్టడం గమనార్హం. దీంతో టెస్టుల్లో మొదటి ఓవర్లోనే అత్యధిక పరుగులు కొట్టిన భారత బ్యాటర్గా యశస్వి జైస్వాల్ ) ఘనత సాధించాడు. అయితే, దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించిన యశస్వి (22)ని స్కాట్ బోలాండ్ బౌల్డ్ చేశాడు. దీంతో తొలిసారి బ్యాటర్గా యశస్వి ఆసీస్ పర్యటన ముగిసినట్లే.



### నాలుగో భారత బ్యాటర్..

అంతర్జాతీయ అరంగేట్రం చేసిన తర్వాత యశస్వి ఆస్ట్రేలియా పర్యటనకు మొదటిసారి వచ్చాడు. పెర్త్ టెస్టులో సెంచరీతోపాటు ఐదు టెస్టుల్లో 43.44 సగటుతో 391 పరుగులు చేశాడు. భారత్ తరపున టాప్ స్కోరర్ కాగా.. ట్రావిస్ హెడ్ (414లి) తర్వాత రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో తొలి సిరీస్లోనే ఎక్కువ పరుగులు చేసిన రెండో భారత బ్యాటర్గా నిలిచాడు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ (1977/78 సీజన్) 450 పరుగులు, వీరేంద్ర సెహ్వాగ్ (2003/04) 464 పరుగులు, మురళీ విజయ్ (2014/15) 482 పరుగులు సాధించారు.

### కోహ్లి.. మళ్లీ అదే తంతు


ఆస్ట్రేలియా పర్యటనలో బ్యాటర్గా విరాట్ కోహ్లి (6) మరోసారి విఫలమయ్యాడు. తన బలహీనతను మరోసారి బయటపెట్టుకొని వికెట్ను సమర్పించాడు. బోలాండ్ బౌలింగ్లో ఆఫ్సైడ్ పడిన బంతిని కదిలించి స్లిప్లో స్మిత్కు విరాట్ క్యాచ్ ఇచ్చాడు. ఈ సమయంలో తీవ్ర అసహనంతో కోహ్లి పెవిలియన్ కు చేరాడు. ఐదు టెస్టుల సిరీస్లో విరాట్ తొమ్మిది ఇన్నింగ్స్ ల్లో 27.14 సగటుతో 190 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క సెంచరీ ఉంది. మిగతా మ్యాచుల్లో కనీసం హాఫ్ సెంచరీ మార్క్ తాకకపోవడం గమనార్హం. ఇక రెండో ఇన్నింగ్స్లో భారత్ ఇప్పటికే టాప్-4 ఆర్డర్ వికెట్లను కోల్పోయింది.

## ఇంటి చిట్కాలు

# చలికాలంలో పంటి నొప్పితో నరకం చూస్తున్నారా..? ఇలా చేస్తే వెంటనే తగ్గుతుంది..

దంతక్షయం, ఇన్ఫెక్షన్, దంతాలు వదులుగా మారడం, విరగడం లేదా చిగుళ్ళవాపు పంటినొప్పికి గల ప్రధాన కారణాలు. పంటి నొప్పి వస్తే నచ్చింది తినలేక.. ప్రశాంతంగా ఉండలేక చాలా మంది బాధపడుతున్నారు.







చలికాలంలో చాలా మంది పంటి నొప్పి సమస్యతో బాధపడుతుంటారు. పంటి నొప్పి వస్తే నరకంతో సమానం. రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల పంటి నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో నిద్రపోవడం దేవుడెరుగు. నొప్పితో అల్లాడిపోవాల్సిందే. దంతక్షయం, ఇన్ఫెక్షన్, దంతాలు వదులుగా మారడం, విరగడం లేదా చిగుళ్ళవాపు పంటినొప్పికి గల ప్రధాన కారణాలు. పంటి నొప్పి వస్తే నచ్చింది తినలేక.. ప్రశాంతంగా ఉండలేక చాలా మంది బాధపడుతున్నారు. దీంతో.. చాలా మంది రకరకాల మెడిసిన్ వాడుతుంటారు. అయితే, ఈ మెడిసిన్ వల్ల కూడా ఒక్కోసారి ఉపశమనం లభించదు. అయితే, ఇలాంటి సమయాల్లో కొన్ని ఇంటి చిట్కాల ద్వారా పంటి నొప్పిని తగ్గించుకోవచ్చంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ఆ చిట్కాలపై ఓ లుక్కేద్దాం.

### లవంగం నూనె..



లవంగం నూనెలో ఎన్నో పోషకాలు ఉంటాయి. లవంగం నూనె యాంటీ బయాటిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్గా పనిచేస్తుంది. ఇది త్వరగా పంటి నొప్పిని తగ్గిస్తుంది. లవంగం నూనెలో యూజినాల్ అనే మూలకం ఉంటుంది. ఇది పంటి నొప్పిని తగ్గిస్తుంది. ఇందుకోసం కాటన్ క్లాత్లో 2-3 చుక్కల లవంగాల నూనెను తీసుకుని నొప్పి ఉన్న ప్రదేశంలో తేలికగా రుద్దండి. ఇది పంటి వాపును తగ్గిస్తుంది. ఆ తర్వాత పంటి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### ఉప్పు, గోరు వెచ్చని నీరు..

ఉప్పులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి వాపు, నొప్పిని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇక, గోరువెచ్చని నీటిలో ఉప్పు కలిపి నోటిని పుక్కిలించడం పంటి నొప్పికి బెస్ట్ ఆప్షన్. ఈ పద్ధతిని మన పెద్దలు ఎప్పట్నుంచో వాడుతున్నారు. ఇందుకోసం ఒక గ్లాస్ వేడి నీటిలో ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపండి. ఉప్పు కరిగిన తర్వాత.. రోజుకు 2-3 సార్లు నోటిని పుక్కిలించండి. ఇందుకోసం రాక్ సాల్ట్ వాడితే మంచిదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల పంటి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### బేకింగ్ సోడా..



బేకింగ్ సోడాని వంటల్లో ఉపయోగిస్తుంటారు. అంతేకాకుండా ఇంటి నివారణ చిట్కాల్లో బేకింగ్ సోడాని బాగా వాడతారు. బేకింగ్ సోడా దంతాల్ని శుభ్రపరుస్తుంది. ఇది బ్యాక్టీరియాను తొలగించడమే కాకుండా వాపును తగ్గిస్తుంది. ఇందుకోసం ఒక చెంచా బేకింగ్ సోడాను నీళ్లలో కలిపి పేస్ట్లా చేసుకోవాలి. ఆ తర్వాత ప్రభావిత ప్రాంతంలో తేలికగా అప్లై చేయాలి. కొంత సమయం తర్వాత నోటిని శుభ్రపర్చుకోవాలి. ఈ రెమెడీ పంటి నొప్పి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది.

### అల్లం, తేనె..



అల్లం సహజ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇంకా తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఈ రెండింటి మిశ్రమం పంటి నొప్పితో పాటు వాపును తగ్గిస్తుంది. ఇందుకోసం.. అల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత అల్లం ముక్కల్ని తేనెతో కలిపి.. నొప్పి ఉన్న ప్రాంతంలో తేలికగా అప్లై చేయాలి. దీంతో వాపు తగ్గడంతో పాటు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### వెల్లుల్లి..



వెల్లుల్లిలో ఎన్నో ఔషధగుణాలు ఉన్నాయి. వెల్లుల్లి, అల్లిసిన్ అనే సమ్మేళనాన్ని కలిగి ఉంటుంది. ఈ అల్లిసిన్ శక్తివంతమైన యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. పంటి నొప్పి, వాపు తగ్గించడంలో వెల్లుల్లి బాగా ఉపయోగపడుతుంది. ఇందుకోసం మొదటగా తాజా వెల్లుల్లి రెబ్బలను చూర్ణం చేసి, ఆపై కొద్దిగా ఉప్పుతో కలపాలి. ఈ మిశ్రమాన్ని నొప్పి ఉన్న భాగంలో రాయాలి. కొద్దిసేపటికే పంటి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### ఈ జాగ్రత్తలు కూడా ముఖ్యం..

- పంటి నొప్పి నుంచి త్వరగా బయటపడాలంటే రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలి. నోటి ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఎక్కువ తీపి ఉన్న పదార్థాలు తీసుకోవడం తగ్గించండి. తీపి పదార్థాల వల్ల నోటిలో బ్యాక్టీరియా స్ప్రెడ్ అవుతుంది.
- దంతాలను శుభ్రం చేసుకోవడమే కాకుండా నాలుకపై ఉన్న పాచి కూడా తొలగించుకోండి. ఇందుకు టంగ్ క్లీనర్ వాడటం మేలు.
- ఏదైనా తిన్న తర్వాత నోటిని పుక్కిలించడం అలవాటు చేసుకోండి. దీంతో.. దంతాల మధ్య ఇరుక్కున్న ఆహార పదార్థాలు బయటకు వస్తాయి.
- రెండు రోజులు పంటి నొప్పి అలాగే ఉంటే.. డాక్టర్ని సంప్రదించండి.

**గమనిక..** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.